# నా జీవితానికిది చాలు - టి.యస్. హరగోపాల్

*23 డిసెంబర్, 1992 కలకత్తా నుంచి వెలువడే ఓ పత్రికలో నే చూసిన వార్త ఆధారంగా*



"వాసాంసి జీర్ణాని యథావిహాయ
నవాని గృహ్ణాతి నరోపరాణి
తథో శరీరాణి విహాయ జీర్ణా
న్యన్యాని సంయాతి నవాని దేహీ"

చినిగిపోయిన పాత బట్టలను విడిచి, మనుజుడు యితరములగు క్రొత్త బట్టల నెట్లు ధరించుచున్నాడో, అట్లే దేహియగు ఆత్మయు శిథిలములైన పాత శరీర ములను వదలి యితర ములగు కొత్త శరీరములను ధరించుచున్నాడు.

భగవద్గీతలోని శ్రీకృష్ణుని ఉపదేశం దూరం నుంచి ఘంటసాల గారి గొంతులో శ్రావ్యంగా విన బడుతోంది.

పవిత్ర కృష్ణానదీ తీరాన, భార్యకి తర్పణం వదులు తున్న రాజశేఖర్‌కి కంటి వెంట నీళ్ళు వచ్చాయి. తన భార్య కూడా పాత బట్టలను విడ చినట్లుగా, పాత శరీరాన్ని వదలి వెళ్ళిపోయింది.

తానిప్పుడు ఒంటరి.

తనతో జీవితాన్ని పంచుకునే అర్ధాంగి యిక లేదు.

ఇంట్లోనూ, ఆఫీసులోనూ తన కష్ట సుఖాల గురించి చెప్పకోటానికింక ఎవ్వరూ లేరు.

'ఈ ముగ్గురు పిల్లలు ఎప్పటికి పెరిగి, పెద్ద వాళ్ళయ్యేను!

తను వాళ్ళనెలా పెంచాలి!

దిక్కులేని పక్షులయ్యామా!

"బాబూ, యింక లేవచ్చు" కర్మ చేయించే బ్రాహ్మణుడు అనడంతో యీ లోకంలోకి వచ్చిన రాజశేఖర్ లేచి, నెమ్మదిగా నడిచి, కారులో కూర్చు న్నాడు.

అతని తమ్ముడు అక్కడి సామగ్రినంతా కారులో వుంచి, కారుని స్టార్టు చేశాడు.

"తొందరలో ఏదో చిన్న మాట అంటే, యిలా జరుగుతుందని తను కలలో కూడా ఊహించ లేదు"

చిన్న మాట!

అది చిన్న మాట ఎలా అవుతుంది!

'చావు, నువ్వు ఛస్తే పీడా విరగడవుతుంది. నేనూ, నా పిల్లలు మా చావు మేము ఛస్తాం"

తన తప్పేమీ లేకపోయినా, తానామెను అంత మాటన్నాడు.

కొడుకు సరిగా చదవటం లేదని మందలి స్తుంటే, ఎక్కడ కొడుకు నొచ్చుకుంటాడోనని తను మధ్యలో కల్పించుకొంది.

అంతే, ఒక్క మారుగ తన కోపం భార్యపైకి మళ్ళింది. విచక్షణా రహితంగా తను ఆమెని

అంత మాటన్నాడు.

అసలు తనకీ మధ్య కోపం ఎక్కువైంది.

ఆఫీసులో పని ఒత్తిడి

ఎదిగే పిల్లలు... వాళ్ళ ఖర్చులు.

చాలీ చాలని జీతం.

ఆశలెక్కువ.

స్థలం కొన్నాడు. ఇల్లు కట్టటానికి బ్యాంకు నుంచి అప్పు తీసుకున్నాడు.

అదీ చాలక సొసైటీ అప్పు, బయట చిట్‌ఫండ్... భార్య నగలని తాకట్టు పెట్టి అప్పు.

ఆ యింటి కార్యక్రమం పెట్టుకోకుండా వుంటే, రెండు చేతులా ఖర్చు పెట్టుకోటానికి డబ్బుండేది.

అయినా, తన మనస్సు ఆమెకి తెలుసు. ఏదో చిరాకులో అంటే, తనకీ శిక్ష వేస్తుందా!

అంతా ఆశ్చర్యంగా వుంది.

తెల్లారేసరికి పిల్లలొక్కసారి, "అమ్మ లేదు... అమ్మ ఏది..." అని అరిచి, ఏడ్వు మొదలెట్టేసరికి, తను నిద్రమత్తులో నుంచి లేచి, "ఏమైంది, యిక్కడే ఎక్కడో వుంటుంది. ఆంటీ వాళ్ళింటికి వెళ్ళి వుంటుంది చూడండి" అంటూ తనూ వెతకటం మొదలుపెట్టాడు.

ఏడు.

ఎనిమిది

తొమ్మిది

వాళ్ళ అన్నయ్య యింట్లోనూ లేదు.

గురువారం గదా సాయిబాబా గుడికి వెళ్ళిందేమో నని చూశారు, లేదు.

సామాన్యంగా తను వెళ్ళే చోటుకల్లా ఫోను చేశారు, లేదు

తొమ్మిది గంటలకు, ఎంతో గాభరాగా పరుగు తీసి, పోలీసు స్టేషనులో కంప్లయింట్ చేశారు.

పిల్లల ఏడ్పులు

పోలీసుల ప్రశ్నలు

స్నేహితుల, చుట్టాల పరామర్శలు.

ప్రమోదిని ఫోటో తీసుకున్నారు పోలీసులు.

"వెళ్ళేటప్పుడు ఏ డ్రస్సు వేసుకొంద"ని అడిగాడు ఇన్‌స్పెక్టరు.

వెళ్తుందని తెలిస్తేగా, వెళ్ళేటప్పుడు ఏడ్రస్సు వేసుకుందో చెప్పటానికి!

పోలీసుల అనుమానపు ప్రశ్నలు.

ఎవరో తన భార్య ఎవరితోనో లేచిపోయి వుంటుందని కూడా కామెంటు చేశాడు.

పిచ్చి కోపం వచ్చింది తనకు.

తన కోసం, పిల్లల కోసం నిత్యం తపన పడే భార్య గురించి అంత అపవిత్రంగా వాళ్ళు మాట్లాడటం సహించలేకపోయాడు.

కాని, నిస్సహాయుడు.

ఒక రోజు గడిచింది.

రెండో రోజు గడిచింది.

మూడో రోజు ఉదయం ఇన్‌స్పెక్టర్ తమ యింటికి వచ్చినప్పుడు ఏమైనా సమాచారం అందిందేమోనని ఆత్రుతగా ముందుకు వెళ్ళాడు తను.

ఇన్‌స్పెక్టర్ ముఖం విషాదంగా వుంది.

"సారీ, రాజశేఖర్‌గారూ... ఐడోంట్ నో వెదర్ అవర్ యిన్ఫర్మేషన్ యీజ్ కరెక్ట్ ఆర్ నాట్... మా యిన్ఫర్మేషన్ తప్పవ్వాలనే ఆశిస్తున్నాం."

"చెప్పండి, ఏమయింది."

"రైలు పట్టాల ప్రక్కన ఓ స్త్రీ శవం పడి వుంది. గుర్తు పట్టటానికి వీలు లేకుండా ముఖం చెక్కేసి వుంది.

ఐతే, మీరు చెప్పిన ఆనవాళ్ళు బట్టి, మీ భార్య ప్రమోదిని గారేమోనని అనుమానం" తన గుండె ఒక్కసారిగా ఆగిపోయింది.

తన భార్యని ఎవ్వరో హత్య చేశారా?

గుర్తు పట్టటానికి వీలు లేకుండా ముఖం చెక్కేశారా!

ఎవరంత దారుణానికి ఒడి గట్టింది!

ఎందుకు!

తన భార్య అసలక్కడికెందుకు వెళ్ళింది!

"ఒక్కమారు వెళ్ళొద్దామా సర్, మీ భార్య కాకపోవచ్చు. మా అనుమానం నివృత్తి అవుతుంది."

తాను, పిల్లలు కారులో పోలీసు జీపు వెంట వెళ్ళారు.

పట్టణానికి దూరంగా, పట్టాల ప్రక్కన శవం పడి వుంది.

ప్రజలు గుంపులు, గుంపులుగా మూగి వున్నారు.

చాలా భయంకరంగా వుంది.

ముఖం చెక్కేసి, వికృతంగా వుంది.

కాని, శరీర సౌష్టవాన్ని బట్టి తను గుర్తు పట్టగలిగాడు... ఔను ప్రమూనే.

"నాన్న... అమ్మే... ఆ చీర, జాకెట్టు అమ్మవే' పిల్లలు గుర్తు పట్టారు.

ప్రజల్లో ఒక్కమారుగా కలకలం.

తాను భూమి మీద నిలద్రొక్కుకోలేకపోయాడు. పిల్లలు తల్లి శవం మీద పడి ఏడుస్తున్నారు.

పోలీసులు ఒక వైపు ప్రజలను దూరంగా నెట్టేస్తూ తనని, పిల్లలని ఊరడించటాన్కి ప్రయత్నిస్తున్నారు.

శవాన్ని పోస్టుమార్టంకి పంపి, తనని, పిల్లల్ని యింటి దగ్గర వుండమన్నారు పోలీసులు.

క్షణాల్లో అందరికీ తెలిసిపోయింది.

తన వాళ్ళు, ప్రమూ తరఫు వాళ్ళు ఆదుర్దాగా వచ్చేశారు.

వాళ్ళడిగే ప్రశ్నలకి తన దగ్గర సమాధానం లేదు.

రెండు గంటల్లో పోలీసులు శవాన్ని తీసుకుని వచ్చి, తమ అధీనం చేశారు.

నిన్నటి వరకు ఉందనుకున్న తన ప్రమూ యీనాడు లేదు.

బంధువులు, మిత్రులు... ఆఫీసు వాళ్ళు... తన పిల్లల స్నేహితులు... యెందరు... యెందరు...

అవును, చావు కూడా పెళ్ళిలాంటిదే అన్నారు.

శవ సంస్కారానికి ఊరు, ఊరంతా వచ్చినట్లుగా వుంది. ప్రమూ శరీరం భస్మమై రెండు రోజు లైంది."

వాకిట్లో కుర్చీలో కూర్చుని, భార్యనే తలపోస్తూ రాజశేఖర్, తనలో తను కుమిలిపోతున్నాడు.

ఎవరో ఒకరు వస్తున్నారు, పోతున్నారు, పరామర్శలు.

సుఖాల్లో పాలు పంచుకుందో, లేదో గానీ, కష్టాలలో పాలు పంచుకుంది.

తనకి యింట్లో సమస్య వచ్చినా, ఆఫీసులో సమస్య వచ్చినా, తనే ధైర్యం చెప్పి, సలహా నిచ్చేది.

బ్యాంకులో డ్రాఫ్టుల కుంభకోణం జరిగినప్పుడు "మన తప్పేమీ లేనప్పుడు, మనం భయము, బాధ పడటం ఎందుకు! పోలీసులకు, మీ ఆర్.ఎం.కు రిపోర్టివ్వండి" అని నైతిక బలాన్నిచ్చింది.

పిల్లలు చదువులో వెనకబడినప్పుడు, 'పెద్ద స్కూళ్ళల్లో కావాలని చేర్పి మార్కులు తక్కువ వచ్చాయనుకుంటే ఎలా, చిన్న ప్రైవేటు కాన్వెంట్సులో చేరిస్తే, మన పిల్లలకీ ఎనభై లొస్తాయి. వాళ్ళే చదువుకుంటార"ని ధైర్యం చెప్పేది.

ఆర్థికంగా యిబ్బంది పడుతున్నప్పుడు, "కావాలని యిల్లు కట్టుకొంటున్నాం... కొద్ది రోజులిబ్బంది పడ్తాం. ఈ లోగా మీ జీతం పెరగదా! పిల్లలు పెద్ద వాళ్ళయితే, యింత ఖర్చులుండవ్," నచ్చచెప్పేది.

భార్యని 'కరణేషు మంత్రి' అన్నారు.

తను రాజు కాకపోయినా, తనకి ఆమె మంత్రి.

హాయిగా సాగుతున్న తమ జీవితంలో యీ అపశ్రుతి ఎందుకు!

భగవంతుడు అంత నిర్దయుడా!

ఎవరూ తన జీవితంలో యింత కష్టాన్ని సూచించ లేదే!

కళ్ళు మూసుకుని, జీవితాన్ని నెమరవేసుకుంటున్నాడు రాజశేఖర్.

ఇంటి ముందు ఆటో ఆగిన శబ్దం అయింది.

"ఇంకెవరు వచ్చారో!" రాజశేఖర్ కళ్ళు తెరవ లేదు. రెండు క్షణాలకి, "ఏమండీ" చిన్నగా పిలుపు.

అది ప్రమూ పిలుపు.

ప్రమూ తనని పిలుస్తోంది.

తనని రమ్మంటోందా!

ఈ లోకంలో అందని సుఖ, శాంతులని ఆ కనపడని లోకాల్లోనైనా అనుభవిద్దామని రమ్మంటోందా!

"ఏమండీ..."
"ప్రమూ... ప్రమూ..."
"ఏమండీ, నేనే ప్రమూని... ప్రమూని వచ్చేశాను,"
రాజశేఖరని తట్టి లేపింది.
"ప్రమూ... నువ్వు... నువ్వు..." రాజశేఖర్ ఆశ్చర్యం నుంచి తీరుకోలేకపోయాడు.
"నేనేనండి... ప్రమూని"
ఆ మాటలకి యింట్లో నుంచి పిల్లలు వచ్చేశారు.
"అమ్మా" భోరున వాళ్ళ అమ్మని పట్టుకొని ఏడ్చేశారు.
రాజశేఖర్‌కి కలో, నిజమో తెలియటం లేదు.
"ప్రమూ... నువ్వు... నువ్వు బ్రతికే వున్నావా!"
"బ్రతికే వున్నానండి... పేపర్లో నేను చచ్చిపోయినట్లుగా వచ్చిన వార్త చదివి పరుగు తీసుకుంటూ వచ్చా."
ఇంట్లో నుంచి అందరూ వచ్చేశారు.
"వదినా... అక్కయ్యా... అమ్మ ప్రమూ..." ఎన్నో పిలుపులు. అందరినీ చూసి ప్రమోదినికి ఒక్క క్షణం మనసు స్తంభించిపోయింది.
ప్రమోదినిని పట్టుకుని, అందరూ ఒక్కమారుగా ఏడ్చేశారు.
అది ఆనందమా!
చనిపోయిన వ్యక్తి వచ్చినందుకు పట్టలేని ఆనందాన్ని అలా వ్యక్తపరిచారు.
"ఎక్కడికి వెళ్ళావ్... ఏమయి పోయావ్" ఎన్నో ప్రశ్నలు.
"మనసు పాడయింది. కష్టాలకి ఒక అంతం లేదా అనిపించి, మానసిక విశ్రాంతి దొరుకుతుందని బాబా ఆశ్రమంకి వెళ్ళా. నాల్గు రోజులు ప్రశాంతంగా గడిపా- ప్రొద్దున్నే బాబా "నీ కష్టాలు తీరాయమ్మా, ఫాల్స్ కాల్‌లో మీ యింటికి పట్టిన గ్రహ పీడ తొలగిపోయింది. నీ భర్త, పిల్లలు ఎదురు చూస్తూ వుంటారు, వెళ్ళిరా" అని చెప్పారు. బస్సెక్కి వచ్చా."
వార్త తెలిసిన పోలీసులు వచ్చారు.
"నిజమేనా సార్, మేము విన్నది!"
"నిజమే యిన్‌స్పెక్టరు గారూ... యిదుగో నా భార్య ప్రమోదని..."
"చాలా సంతోషం... ఏమ్మా, యింత హడావిడి చేశావ్...... ఇంతకీ ఆ శవం ఎవరిది? మీ భార్యదని ఎలా అనుకున్నారు?..."
"మానసికంగా కృంగిపోయిన నాకు, పిల్లలకి ఆకారాన్ని బట్టి, కట్టుకున్న చీర, జాకెట్టు బట్టి, నా భార్య అనుకున్నాం. క్షమించండి యిన్‌స్పెక్టర్ గారూ... ఆ శవం ఏ అభాగినిదో!'
"ఓ.కె. రాజశేఖర్ గారూ, పోనివ్వండి. మీరు సాయంత్రం వచ్చి, మీ కంప్లెయింట్ వాపసు తీసు కోండి" అని కరచాలనం చేసి వెళ్ళిపోయాడు యిన్‌స్పెక్టర్.
ఒక్క మారుగ యింట్లో పండగ సందడి వచ్చింది. అప్పటి వరకు శ్రాద్ధ కర్మలకి కావలసిన వంటలు చేస్తున్న వంట వాళ్ళని తీపి పిండి వంటలేమైనా చేయమని ఆదేశించాడు రాజశేఖర్.
సాయంత్రానికందరూ ఎవరిళ్ళకి వాళ్ళు వెళ్ళిపోయారు.
పిల్లలు జరిగిందంతా మరచిపోయి పుస్తకాల సంచులు తీశారు.
రాత్రి పది గంటలకు భర్త దగ్గరకు పాల గ్లాసుతో వచ్చిన భార్యని, "రా, ప్రమూ" అని దగ్గరకు తీసుకున్నాడు రాజశేఖర్.
ప్రక్కన టేబుల్ మీద పాలగ్లాసు పెట్టి, భర్త ప్రక్కన కూర్చుంది ప్రమోదిని.
"నన్ను క్షమించు ప్రమూ" ఒక్కమారుగ రాజశేఖర్ ప్రమూ చేతులు పట్టుకుని, ఏడ్చేశాడు.
"ఛ, ఎందుకండి, మీరేం తప్పు చేశారు? తప్పు నాదే, చెప్పకుండా వెళ్ళటం..."
"లేదు ప్రమూ... నిన్ననవసరంగా తిట్టాను. అసలు ఈ మధ్య సంస్కారాన్ని కూడా మరచి ప్రవర్తిస్తున్నా అంతకంటే కూడా ఎవరో అభాగిని శవాన్ని చూసి, నువ్వనుకొని భ్రమపడి, నీ శ్రాద్ధ కర్మలు చేశా. ఇంతకంటే పాపం ఏమైనా వుందా..."
"లేదండీ, నేను బాధపడటం లేదు. ఎందరికి యీ అదృష్టం కలుగుతుంది! నేను బ్రతికుండగానే నా భర్త చేత ఉత్తర కర్మలు చేయించుకున్నాను. రేపు నేను నిజంగా చచ్చిపోయినా, నా గురించి ఎవరైనా బాధపడ్తారా లేదా అనే అనుమానం యింక నాకు లేదు. నేను చనిపోతే నా కోసం విలపించే వాళ్ళు ఎంత మందున్నారో నా కళ్ళారా చూశా నా కోసం "ప్రమూ, ప్రమూ' అని తపించే, కలవరించే భర్తని చూశా. ఎప్పుడూ వినే పిలుపైనా, 'అమ్మా' అనే ఆ పిలుపులో మాధుర్యాన్ని నా పిల్లల నోటి వెంట అనుభవించా. తల్లిదండ్రులు, అత్తమామలు, అన్నలు, మరిది... యింత మంది చుట్టాలు, స్నేహితులు... రోజూ చూసే, రోజూ మాట్లాడే వీళ్ళందరిలో నేనంటేవున్న అభిమానాన్ని కళ్ళారా చూశా. ఈ యింట్లో నా ఉనికి కేమైనా విలువుందా అనే నా మనుస్సులోని అనుమానం పటాపంచలయింది. ఇది నా యిల్లు... నా భర్త... నా పిల్లలు... నా చిన్ని సామ్రాజ్యం... నా రాజ్యానికి నేనే రాణిని... నా కింకా యింతకంటే ఏం కావాలి! నా జీవితానికిది చాలు. నేను యింక నిజంగా చచ్చిపోయినా ఫర్వా లేదు..."
ప్రమోదిని ఆనందవుటావేశానికి రాజశేఖర్ తన చేతిని ఆమె నోటి కడ్డం పెట్టి, ఆమెని దగ్గరకు తీసుకున్నాడు. ఆమె అతనిలో గువ్వలా ఒదిగి పోయింది.

## ఎవరు చూస్తారు...



నిద్రించని జలపాతం
రాత్రి సమయాల్లో
చెవులొగ్గిన శిలల మీద
పడి గెంతడం – ఎవరు చూస్తారు?
నది తగ్గిన దేవాంగ్ నది
శిగపూవులతో
చీకటిలోయల్లోకి
ప్రవహించడం – ఎవరు చూస్తారు?
నది నెత్తిన సూర్యున్ని
సరిగా చూడనివ్వని
పొడవైన గుబురువృక్షాలు
రాల్చిన ఆకులను – ఎవరు చూస్తారు?
కొండపూవులపై వాలే
పెను సీతాకోక చిలుకను
నది ఒడ్డున చెక్క ఇంట్లో
మిణుకుమనే దీపాన్ని – ఎవరు చూస్తారు?
దట్టమైన నానక్‌ఢసా అడవుల్లో
సెలయేరులను, నదిజాడలను
కదిలేనీడలను,
ప్రియురాలి కన్నుల్లో – ఎవరు చూస్తారు?

– తమ్మినేని యదుకుల భూషణ్